# వ్రత కల్లోలం

శ్రావణ మాసం వచ్చేసింది. ఆకాశం నల్ల మబ్బులతో నిండిపోయి వురుములు, మెరుపులతో భయపెడుతూనే వుంటుంది. కాని వర్షం ఎప్పుడు కురుస్తుందో ఎవరికీ తెలీదు. రెయిన్ కోటు , బూట్లూ వేసుకుని పకడ్బందీగా బయటికెళ్ళినప్పుడు చస్తే వర్షం రాదు. అదే బద్ధకించి సీదాసాదాగా వెళ్ళిన రోజు ముంచెత్తిపోస్తుంది. ఆటోలూ, బస్సులు దొరక్క పూర్తి ముద్దయిపోయి మూడు గుంటల్లోపడి, ఆరు కాలవల్లో ఈదుకుంటూ జల ప్రవేశం చేసిన బుద్ధ విగ్రహంలాగా గృహ ప్రవేశం చేస్తాం.

బయట వర్షంగోల ఇంట్లో వ్రతాల గోల క్రొత్తగా పెళ్ళయిన కన్నె పిల్ల దగ్గిర్నించి ముప్పయేళ్ళుగా కాపురం చేస్తున్న ఇల్లాళ్ళ దాకా, తలంట్లు , పూజలు , వ్రతాల సీజను ఆడవాళ్ళకి బోల్డంత హడావుడి. వరలక్ష్మి వ్రతం అనో, సౌభాగ్య వ్రతం అనో, అనేక నామాంతరాలతో పతి దేవుడి విజయాలకి , అయిదోతనం కోసం జోరుగా హుషారుగా భారీ ఎత్తున పూజలు, పునస్కారాలు నిర్వహింపబడతాయి. ఈ పూజలకి, వ్రతాలకూ్కడా ప్రపంచ బ్యాంకు సహాయం చేస్తే బావుంటుంది. సుబ్బారావు లాంటి మధ్య తరగతి మొగుళ్ళు ఊరి బయటికెళ్ళి ఎవరి కంటా పడకుండా జుట్టు పీక్కుని, లెంపలేసుకునే పరిస్థితి తప్పుతుంది. చీరెలు, సారెలు, పిల్లలకి పట్టు లంగాలు, పూజాసామాగ్రి , పేరంటం ఖర్చు వెరసి తడిసి మోపెడవుతోంది. అసలే స్కూళ్ళు కాలేజీల దెబ్బలకి అరిగిపోయిన పతి దేవుడికి ఈ శ్రావణ మాసం పులి మీద పుట్ర పుండు మీద కారం . మూలిగే నక్క మీద తాటి పండు. అయినా తప్పదు. వ్రత కల్లోలానికి లోను కాకతప్పదు.

ఆర్ధికపరమైన ఇబ్బందులే కాకుండా వేరే రకం ఇబ్బందులు, గొడవలూ గూడా ఎదురవుతాయి. వ్రతాల గొడవల్లో పడిపోయిన వైఫ్‌లు, అమాయకపతి దేవుళ్ళని పట్టించుకోరు వంటలు ఆలస్యం అవుతాయి కాబట్టి ఆఫీసుకెళ్ళాల్సిన వాళ్ళు పర గడుపునే ప్రయాణం కడతారు. ఆరోజు పళ్ళు ఫలాలు, ఆకులు అలవులు తిని కాలక్షేపం చేస్తారు. కాఫీ, టీ నీళ్ళతో అభిషేకం , అరిటి పళ్ళ నైవేద్యంతో ఆ రోజుకి ఉదరపూజ పూర్తి చేస్తారు. ఎప్పుడెప్పుడు సాయంత్రం అవుతుందా, చక్కగా కొంపకెళ్ళి భోజనం

చేద్దామని గంటలు గంటలు గడిపి ఆవురావురమంటూ. ఇంటికెడతారు. తీరా ఇంటికెడితే లోపల పేరంటాళ్ళ హడావుడి. మా చంటాడు గేట్లోనే ఎదురయ్యి, ' దొడ్డి వాకిట ' మిమ్మల్ని వంట గది ప్రవేశం చేయిస్తారు. మీరు ముత్తయిదువుల నిష్క్రమణని కాంక్షిస్తూ ఏ గ్యాసు బండ పక్కనో, సెటిలయిపోతారు. కానీ, ముత్తయిదువుల్లో గూడా రకరకాల వాళ్ళుంటారు. వాయినం పుచ్చుకోగానే వాయువేగంతో వేరే ఇంటికి వెళ్ళే సూపర్ సానిక్ జెట్ లాంటి వాళ్ళు కొంతమందయితే , ఒకే ఇంటిని నమ్ముకుని, ఇచ్చిన శనగల్ని ఒక్కొక్కటి ఆరగిస్తూ పాత కాలంలో వ్రతాలు, పేరంటాలు ఏ విధంగా జరిగేవి, ఆ కాలం, ఆ రోజులు, ఆ మనుషులు, ఆ సర్దాలూ వగైరా వాటిని గురించి , గంటల కొద్దీ వుపన్యాసాలు దంచే వృద్ధ ముత్తయిదువులూ వుంటారు. మీ గ్రహాచారం బాగుండకపోతే ఇలాంటి వృద్ధనారి మీ ఇల్లాలిగ్గాని తారసపడితే వంటింట్లో వుండిపోయిన మిమ్మల్ని ఆ పెరుమాళ్ళు కూడా కాపాడలేడు. అసలే తిండి తిప్పలు లేక కళ్ళు తిరుగుతుంటే, చెమటలు కక్కుతూ ' హే భగవాన్ ఏవిటి నీ లీల ' అంటూ ఆది పురుషుడ్ని స్మరించుకుంటూ కాలం వెళ్ళతీయాలి. అయినా ఒక్కర్నని ఏం లాభం, మన బంగారం మంచిది కానపుడు అంటూ శ్రీమతి పైన చిరాకు పడతాం. మన బంగారాల్లో గూడా రెండు రకాల వాళ్ళున్నారు. వ్రతా కార్యక్రమాన్ని ముక్తసరిగా ముగించే వాళ్ళు ఒక రకం అయితే, తు.చ తప్పకుండా పుస్తకాల్లో రాసింది రాసినట్లు, విన్నవి, కన్నవీ గూడా జోడించి కమనీయంగా నిర్వర్తించే వాళ్ళు రెండో రకం, పూజలు పూర్తి కాగానే, పతి దేవుడి పాద పద్మములు తాకి ఆశీస్సులు పొందవలెను అని గాని పుస్తకంలో రాసుంటే , అక్షింతలు చేత్తో పుచ్చుకుని , మడి బట్టతో సరాసరి ఆఫీసులకి వచ్చేయగల్రు. ఫైలు స్టడీ చేస్తున్న పతిమూర్తి సతిని గాంచినవాడయ్యి నిశ్చేష్టుడయ్యి, జ్ఞాన నేత్రంబున భార్య వుద్దేశమ్మును దర్శించి, ఆమెను ఆఫీసు వెనక్కి తీసుకుని వెళ్ళి అక్షింతలు వేయించుకుని ఆశీర్వదించి తన వంతు కార్యమును పూర్తి చేయును.

ఈ విధంగా శ్రావణ మాసం వచ్చి వర్షాల్ని , వ్రతాల్ని కురిపించి కొంతమందికి ఆహ్లాదాన్ని, మరికొంత మందికి ప్రళయాల్ని సృష్టించిపోతుంది. అయినా ఎండిన నేల తడిస్తే అందం, ఆనందం. అలాగే యాంత్రికమైన జీవితాల్లో ఈ శ్రావణ మాసపు పూజలకు వేళాయెరా అనంటే ఖర్చుకి, ప్రొసీజరుకి భయపడి కస్సుమనకండి. ఆవిడతో కోపరేట్ చేసి సంస్కృతి సాంప్రదాయాన్ని కాపాడండి – ప్లీజ్

------- **అయ్యిపోయింది** -------